క్లుప్తంగా

ఘన సన్మానం



నెల్లూరు(బృందావనం): పద్మవిభూషణ్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంత్యుత్సవాలను పురస్కరించుకొని విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి బొగ్గవరపు శ్రీమన్నారాయణను శుక్రవారం సత్కరించారు. గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో కృష్ణ కల్చరల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మురళీమోహన్‌రావు, జయప్రకాష్, శ్రీను, సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (పొగతోట): జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను డ్వామా పీడీ గంగాభవానీ మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. జెడ్పీ కార్యాలయంలో భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు.

సీపీఎం నేతల ధర్నా



నెల్లూరు సిటీ: సౌత్‌మోపూరులోని రామయ్య చెరువు వద్ద నెల్లూరు – తాటిపర్తి రోడ్డు దెబ్బతినకుండా శాశ్వత ప్రాతిపదికన తూములను ఏర్పాటు చేయాలని సీపీఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ నేతలు కోరారు. ఈ మేరకు 17వ కిలోమీటర్ తూము వద్ద శుక్రవారం చేపట్టిన ధర్నాలో పార్టీ రూరల్ మండల కార్యదర్శి ఆలూరు తిరుపాల్, మండల కమిటీ సభ్యుడు పూడిపర్తి జనార్దన్ మాట్లాడారు. తాటిపర్తి రోడ్డు పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని, అయితే దీనిపై కాలువ, చెరువు నీరు ప్రవహిస్తోందని చెప్పారు. ఈ నీరు వెళ్లేందుకు వీలుగా గతంలో రెండు చోట్ల తూములుండేవని, అయితే ప్రస్తుతం అవి కుంగిపోవడంతో సమస్య ఏర్పడుతోందని వివరించారు. తూములను వేయించి రోడ్డు దెబ్బతినకుండా చూడాలని కోరారు. నేతలు జానా లక్ష్మీప్రసాద్, శ్రీపతి వెంకయ్య, అనిల్, బాలు, ఆదిశేషయ్య, అనంతయ్య, రత్నం తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులపై చర్యలకు డిమాండ్



నెల్లూరు (టౌన్): విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్న డిగ్రీ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వీఎస్‌యూలో వీసీ విజయభాస్కర్‌రావుకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. నేతలు సుకుమార్, సంతోష్, సిసింద్రీ, చక్రి, అశ్విన్, మహీల్ పాల్గొన్నారు.

మోటార్‌బైక్‌ను ఢీకొన్న ఆటో

• వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గూడూరుకు చెందిన ఇస్మాయిల్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి గూడూరుకు బయలుదేరాడు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇస్మాయిల్‌కు గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం పంపిణీ

• ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్

తోటపల్లిగూడూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ పేర్కొన్నారు. మండలంలోని మాచర్లవారిపాళెం, గణపతినగర్‌లో ఉన్న కేంద్రాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలన అనంతరం చిన్నారులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు.

➡ నెల్లూరులోని వెంగళరావ్‌నగర్‌కు చెందిన ఓ బాలిక ఇంట్లో ఒంటరిగా ఉంది. విషయాన్ని గమనించిన ఆమె మామ, అతని స్నేహితుడు ఇంట్లోకి చొరబడి లైంగిక దాడికి పాల్పడ్డారు. జరిగిన విషయాన్ని తల్లికి బాధితురాలు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై పోక్సో చట్టం కింద కేసును పోలీసులు నమోదు చేశారు.

➡ కావలికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక ఇంటి పక్కనే ఓ వృద్ధుడు నివాసం ఉంటున్నారు. బాలిక కుటుంబంతో చనువుగా ఉండేవారు. ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో లైంగిక దాడికి పాల్పడ్డారు. బాలిక మౌనంగా ఉండటాన్ని గమనించిన తల్లి గట్టిగా నిలదీయడంతో వృద్ధుడి వికృత చేష్టలను తెలియజేశారు. దీంతో పోలీసులకు వారు ఫిర్యాదు చేశారు.

➡ కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు మండలంలో ఎనిమిదేళ్ల గిరిజన బాలికపై వరుసకు బాబాయ్ లైంగిక దాడికి పాల్పడ్డారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో నిత్యం చోటుచేసుకుంటూనే ఉన్నాయి.

చిన్నారులూ.. జాగ్రత్త

• వలేస్తున్న నిందితులు
• తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి
• గుడ్.. బ్యాడ్ టచ్‌పై పోలీసుల అవగాహన

ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు	
డయల్	112
చైల్డ్ లైన్	1098
వాట్సాప్	91212 11100



వెంకటేశ్వరపురంలోని పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా

నెల్లూరు(క్రైమ్): ఆత్మీయంగా దగ్గరికి తీసుకుంటే అభంశుభం తెలీని చిన్నారులు మురిసిపోతారు. అన్న, మామ, తాతయ్య, బాబాయ్ అంటూ ముద్దులొలికే మాటలు చెప్తూ దరిచేరుతారు. అవతలి వ్యక్తి నవ్వు వెనుక విషం దాగి ఉందనే విషయం తెలుసుకోలేని పసిప్రాయం వారిది. ఫలితంగా మృగవాంఛలకు బలవుతున్నారు. వారికి ఇంటా, బయటా రక్షణ కొరవడుతోంది.

అవగాహన ముఖ్యం

గుడ్.. బ్యాడ్ టచ్‌పై బాలికలకు తల్లులు వివరించాలి. వీపుపై తట్టడం, నిమరడం, సున్నితమైన భాగాలను టచ్ చేస్తూ ఉంటే తమకు చెప్పాలని వివరించాలి. ఇతర భాగాలను ముట్టుకోవడం, తరచూ కౌగిలించుకోవడం తదితరాలను చేస్తే వెంటనే తెలియజేయాలని కోరాలి. ఇలా వ్యవహరించే వ్యక్తి మంచి వాడు కాదని, హాని చేసే అవకాశం ఉందనే విషయాన్ని వారికి అర్థమయ్యే రీతిలో చెప్పాలి. ఇలాంటి వ్యక్తుల వద్ద ఉండకుండా వెంటనే వెళ్లిపోవాలనే విషయాన్ని తెలియజేయాలి. గుడ్.. బ్యాడ్ టచ్‌పై ఆన్‌లైన్లో యానిమేషన్ కథలు, వీడియోలు చాలానే ఉన్నాయి. వీటిని వారికి చూపించాలి. ఇవి చూశాక పిల్లలకు ఏం అర్థమైందో తెలుసుకొని, అర్థం కాని విషయాలను వివరించాలి. తప్పుడు ఉద్దేశంతో తాకుతున్న వారిని గుర్తించేలా తర్ఫీదునివ్వాలి. పిల్లలు ఉపయోగించే డిజిటల్ పరికరాలపై సైతం నిఘా ఉంచాలి.

ఫిర్యాదులను తేలిగ్గా తీసుకోకూడదు

చిన్నారులు కొన్నిసార్లు కుటుంబసభ్యుల నుంచే లైంగిక దాడులకు గురవుతుంటారు. ఇలాంటి పరిస్థితులను తల్లులు గమనిస్తుండాలి. వీటిపై ఫిర్యాదు చేస్తే తేలిగ్గా తీసుకోరాదు. ఒకటికి రెండు సార్లు పరిశీలించి తగు చర్యలు చేపట్టాలి. పాఠశాలల్లోనూ బాలికల ప్రవర్తనను ఉపాధ్యాయులు గమనిస్తుండాలి.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన

గుడ్.. బ్యాడ్ టచ్‌పై జిల్లాలోని విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దురుద్దేశంతో చిన్నారులను దగ్గరికి తీసే వ్యక్తుల ప్రవర్తన ఎలా ఉంటుంది.. శరీర నమూనాల చిత్రపటం ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరిస్తున్నారు. ఇంటా, బయటా, బడిలో ఎక్కడైనా వేధింపులకు గురైతే వెంటనే తల్లిదండ్రులతో పాటు పోలీసులకు తెలియజేయాలని సూచిస్తున్నారు. ఆకర్షణలకు లోనై జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరుతున్నారు. తల్లిదండ్రులతోనూ సమావేశాలను నిర్వహిస్తున్నారు. చిన్నారులు ఎక్కడికెళ్తున్నారు.. ఎవరితో మాట్లాడుతున్నారనే అంశాన్ని తల్లిదండ్రులు గమనించాలని, ఇళ్ల వద్ద ఉండే వ్యక్తుల ప్రవర్తనపై ఓ కన్నేసి ఉండాలని సూచిస్తున్నారు. ఏదైనా అనుకోని ఘటన చోటుచేసుకుంటే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, వివరాలను గోప్యంగా ఉంచి నిందితులపై చర్యలు చేపడతామని చెప్తున్నారు. హెల్ప్‌లైన్ నంబర్లను విద్యాసంస్థల్లో అందుబాటులో ఉంచుతున్నారు.

బైబిల్ కాలేజీ గ్రాడ్యుయేషన్ సర్వీస్



నెల్లూరు(బృందావనం): బాప్టిస్ట్ చర్చి డొనీహాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాప్టిస్ట్ థియోలాజికల్ కాలేజ్ గ్రాడ్యుయేషన్ ఆరాధనను శుక్రవారం నిర్వహించారు. వీఆర్సీ సెంటర్ సమీపంలోని చర్చిలో కాలేజీ డైరెక్టర్, రెవరెండ్ మణిరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ ఏసీటీసీ బైబిల్ కాలేజీ పూర్వ ప్రిన్సిపల్ రెవరెండ్ జాన్‌ప్రభాకర్, సంఘ కాపరి రెవరెండ్ శ్యామ్‌సన్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. అనంతరం 2022 – 24 మధ్య బైబిల్ విద్యను అభ్యసించిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. క్వైర్ భక్తి గీతాలను ఆలపించారు. బైబిల్ కళాశాల రిజిస్ట్రార్, సెక్రటరీ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫ్యాకల్టీ రెవరెండ్ డేవిడ్ లివింగ్‌స్టన్, డాక్టర్ కృపాల్, రెవరెండ్ అనిల్‌కుమార్, సంఘ చైర్మన్ సురేంద్ర, వైద్యుడు సుందర్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని అందించాలని వినతి



జేసీకి వినతిపత్రమిస్తున్న రైతు సంఘాల నేతలు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని రైతులకు సాగునీటిని అందించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘాల సమాఖ్య నేతలు కోరారు. ఈ మేరకు జేసీ కార్తీక్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. రెండో పంటకు నీటి వసతి లేకపోవడంతో బోరు పాయింట్లలో ఉన్న రైతులు కొంత వరకు సాగు చేశారని, ఇందులో 95 శాతం వరికోతలు పూర్తయ్యాయని వివరించారు. సోమశిల జలాశయంలో నీటి నిల్వ ఎక్కువగా ఉన్న తరుణంలో, ఈ సీజన్లో పూర్తి విస్తీర్ణానికి అందించే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. నార్లు పోసుకునేందుకు నీటిని విడుదల చేయాలని కోరారు. సమాఖ్య అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి, హనుమంతయ్య, ఏవీఆర్ నాయుడు, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ సభల జయప్రదానికి పిలుపు



పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు (టౌన్): పీడీఎస్‌యూ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా వర్సిటీలో నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని సంస్థ జిల్లా కార్యదర్శి షారూఖ్ కోరారు. సభకు సంబంధించిన పోస్టర్లను నగరంలోని పాత అనిత థియేటర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సభ్యులు మస్తాన్, నవీన్, హర్ష, పూజిత, వంశీ, చరణ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న కిశోర్‌కుమార్

నెల్లూరు(క్రైమ్): రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుజబుజనెల్లూరులోని హైస్కూల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్ మాట్లాడారు. గుడ్.. బ్యాడ్ టచ్, మత్తు, మాదకద్రవ్యాల వినియోగంతో సంభవించే దుష్పరిణామాలు, ట్రాఫిక్ నిబంధనలు తదితరాలను వివరించారు.

అత్యవసర వేళ 112ను సంప్రదిస్తే తగు చర్యలు చేపడతామని చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వివిధ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గాంధీ గిరిజన కాలనీ, వారధి సెంటర్, సాలుచింతల తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

➡ శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని అయ్యప్పగారితోట, దీన్‌దయాళ్‌నగర్, పల్లిపాడు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

➡ యనమలవారిదిన్నె సబ్‌స్టేషన్ పరిధిలోని ఆకుతోట, బలిజపాళెం, మిట్టపాళెం, మల్లెమ్మ తోట తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

➡ ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని బ్రహ్మానందపురం, రాజగోపాలపురం, ఆదర్శ్‌నగర్, సుజాతమ్మకాలనీ, జేవీఆర్ కాలనీ, లక్ష్మీనరసింహపురం, బెజవాడ ఓబుల్‌రెడ్డినగర్, కేవీఆర్ పెట్రోల్ బంక్ ప్రాంతం, ఎస్పీ కార్యాలయం, నీలగిరి సంఘం, బట్వాడిపాళెం, బారాషహీద్ దర్గా తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని వివరించారు.

ఆనంతో పర్వతరెడ్డి భేటీ



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డితో చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో పార్టీ సిటీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు.

అలరించిన అష్టావధానం



నెల్లూరు(బృందావనం): ఆంధ్ర వాల్మీకి పోలూరి హనుమజ్జానకీరామశర్మ శత జయంత్యుత్సవ ముగింపు కార్యక్రమాన్ని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ సూరం శ్రీనివాసులు అధ్యక్షతన కొండపి మురళీకృష్ణ అష్టావధానం చేశారు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. హనుమజ్జానకీరామశర్మ జీవితం – సాహిత్యం పుస్తకం, శ్రీరామపట్టాభిషేక పటం, ప్రసాదాన్ని అందజేశారు. డాక్టర్ ప్రసాద్‌రావు, గిరిజాలక్ష్మి, అరుణ, బృందావనరావు, సుబ్బారావు, లక్ష్మీనరసింహారావు, వెంకటేశ్వరరావు, సాయికుమార్‌రెడ్డి, పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు, నిర్వాహకుడు వేదం వెంకటరాధాకృష్ణ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు



మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరంలోని బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. శానిటేషన్ కార్యదర్శులు రోజూ ఫీల్డ్ విజిట్ చేయాలని, పారిశుధ్య సమస్యలను గుర్తించి కమాండ్ కంట్రోల్ కేంద్రానికి తెలియజేయాలని సూచించారు. పారిశుధ్య కార్మికులతో మొబైల్ ఆధారిత హాజరును వేయించాలని, విధి నిర్వహణలో రక్షణ ఉపకరణాలను తప్పక వినియోగించాలని కోరారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అంశం తన దృష్టికి వస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత కోసం నగరపాలక సంస్థలో అందుబాటులో ఉన్న వాహనాలు, యంత్రాలకు మరమ్మతులు చేసి పూర్తి స్థాయిలో వినియోగించాలని చెప్పారు. ప్రచార పోస్టర్లు, భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై తొలగించాలన్నారు. హెల్త్ ఆఫీసర్ చైతన్య, డీఈ సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్టీపీలతో సమావేశం

కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమావేశాన్ని కమిషనర్ సూర్యతేజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థ అనుమతుల మేరకు నిర్మాణం జరిగేలా పర్యవేక్షించాలని, ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపడతామని చెప్పారు. ఇంకుడుగుంతలను తప్పక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భవన నిర్మాణానికి సంబంధించిన సెట్ బ్యాక్ అనుమతి మేరకు ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. రోడ్లను ఆక్రమిస్తూ మెట్లు, ర్యాంపులను నిర్మించకుండా, వర్షపు నీరు కాలువల ద్వారా సాఫీగా ప్రవహించేలా నిర్మాణాలను పరిశీలించాలని ఆదేశించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు, దశయ్య, నుడా పీఓ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను చెల్లించండి

ఆస్తి, కుళాయి, డ్రైనేజీ పన్నులు, బకాయిలను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ సూర్యతేజ కోరారు. అలా కాకపోతే కుళాయి, డ్రైనేజీ తదితర అత్యవసర సేవలను నిలిపేయనున్నామని చెప్పారు.

పేదలకు అండగా వైఎస్సార్‌సీపీ



బాధితుడికి సాయాన్ని అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): పేదలకు ఎలాంటి కష్టమొచ్చినా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 42వ డివిజన్లో గల కోటమిట్టలో పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజా హుస్సేనీ, అతహర్‌తో కలిసి ఎమ్మెల్సీ శుక్రవారం పర్యటించారు. తొలుత కరిముల్లా నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులు, పార్టీ నేతలతో ముచ్చటించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదానికి గురైన నివాసానికి వెళ్లి బాధిత కుటుంబానికి పార్టీ తరఫున సాయాన్ని అందజేశారు. అనంతరం 43వ డివిజన్ పార్టీ నేత అబ్దుల్ మస్తాన్ కార్యాలయాన్ని సందర్శించారు. పార్టీ నేతలు షకీల్, కోటేశ్వరరెడ్డి, శేషు, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల్లో లోపాలను సరిదిద్దరూ..



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖలో ఏఎన్‌ఎం గ్రేడ్ – 3గా పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతులను కల్పించడంలో జరిగిన లోపాలను సరిదిద్దాలని ఏపీ హంస అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కోరారు. ఈ మేరకు యూనియన్ నేతలతో కలిసి సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్యకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జాయినింగ్ డేట్, ర్యాంకింగ్‌లను పలువురికి తప్పుగా నమోదు చేశారని, వీటిని సరిచేయాలని కోరారు. వివిధ అంశాలను తెలియజేశారు. అసోసియేషన్ నేతలు నాగరాజు, మురళి, మహేష్, ఉమామహేశ్వర్, నాగయ్య, మాధవ, మధుసూదన్‌రెడ్డి, సుమంత్, మహిళా విభాగ సెక్రటరీ ఉమామహేశ్వరి, బాలనాగమ్మ పాల్గొన్నారు.

ఆశ వర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాల్సిందే



మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

నెల్లూరు(బృందావనం): కలిగిరి మండలం రావులకొల్లుకు చెందిన ఆశ వర్కర్ పందిటి విజయను రాజకీయ కక్షతో విధుల నుంచి తొలగించారని, ఆమెను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వివిధ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. విజయకు సంఘీభావంగా టౌన్‌హాల్లోని రీడింగ్ రూమ్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని పెంచలనరసయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఆమెకు న్యాయం జరిగేంత వరకు ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాన్ని సాగిస్తామని స్పష్టం చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, వెంగయ్య, పౌరహక్కుల సంఘ జిల్లా నేత ఎల్లంకి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.